క్లుప్తంగా

కనుల పండువగా తిరుపతమ్మ గ్రామోత్సవం



పెనమలూరు: మండలంలోని కానూరులో శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్యస్వామివార్ల గ్రామోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. మంగళవారం అర్ధరాత్రి వరకు తిరుపతమ్మ మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. బుధవారం ఉదయం స్వామివార్ల విగ్రహాలను ప్రత్యేక వాహనంపై ప్రతిష్ఠించి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ నెల 14వ తేదీన అన్నసమారాధన నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ తెలిపింది.

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో తాగునీటి పైపులైను పగిలిపోవడంతో పంచాయతీ ఆధ్వర్యంలో సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. గొల్లపూడి పంపింగ్ స్కీము నుంచి వచ్చే నీటిని చెరువు నింపి, ఫిల్టర్ చేసిన తరువాత ట్యాంకుల ద్వారా గ్రామంలో తాగునీరు సరఫరా చేస్తారు. ప్రస్తుతం పైపులైను మరమ్మతులు జరుగుతున్నాయి. నున్న గ్రామానికి గొల్లపూడి ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా జలాలు, పోలవరం కాలువ ద్వారా గోదావరి జలాలు వస్తున్నాయి. వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు పోలవరం కాలువ నుంచి వచ్చే గోదావరి జలాలను వేరే చెరువుకు మళ్లించి, ఆ నీటిని ఫిల్టర్ చేసి ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తామని పంచాయతీ కార్యదర్శి జి.టి.వి.రమణ తెలిపారు. పైపులైను మరమ్మతుల కారణంగా ప్రజలకు తాగునీటి సమస్య ఉండదన్నారు.

ఉప్పులూరు రైల్వే గేటు ధ్వంసం



కంకిపాడు: ఓ ట్రాక్టర్ ట్రక్కుతో రైల్వే ట్రాక్ దాటే సమయంలో ఒక్కసారిగా గేటు పడింది. దీంతో రైల్వే గేటు ధ్వంసమైంది. మండలంలోని ఉప్పులూరు రైల్వే క్రాసింగ్ వద్ద బుధవారం ఈ ఘటన జరిగింది. గన్నవరానికి చెందిన అడితీ ట్రాక్టరు సెంట్రింగ్ సామగ్రితో కంకిపాడు వైపు వెళ్లే క్రమంలో ఉప్పులూరు వద్ద రైల్వే క్రాసింగ్ దాటుతున్న సమయంలో రైలు వస్తున్న సంకేతంతో పర్యవేక్షకుడు గేటు వేశాడు. ట్రాక్టరు ట్రక్కుకు వెనుక భాగాన రైల్వే గేటు ఇరుక్కుని ధ్వంసమైంది. దీంతో కంకిపాడు–గన్నవరం రోడ్డు మార్గంలో వాహనాల రాకపోకలకు అసౌకర్యం ఏర్పడింది. పర్యవేక్షక సిబ్బంది జరిగిన ఘటనపై గుడివాడ డివిజన్ రైల్వే అధికారులకు సమాచారం అందించారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



కంకిపాడు: మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని వక్తలు సూచించారు. విజన్ ఇండియా, నెహ్రూ యువ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ఈడుపుగల్లులో మహిళా సాధికారత, మహిళా ఆరోగ్యంపై బుధవారం సదస్సు నిర్వహించారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఎల్.వి.రావు మాట్లాడుతూ.. ఆరోగ్య భద్రత, మానసిక స్థితిని మెరుగుపర్చుకోవటంపై సలహాలు అందించారు. విజన్ ఇండియా డైరెక్టర్ ఎ.జె.బాబు మాట్లాడుతూ సుస్థిరాభివృద్ధి, అన్ని రంగాల్లోనూ రాణించేలా మహిళలు ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా 45 మంది మహిళలకు దుస్తులు పంపిణీ చేశారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

పెనమలూరు: అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న వ్యక్తిపై పెనమలూరు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కానూరుకు చెందిన ఎం.లావణ్యకు ఏడు సంవత్సరాల క్రితం అవనిగడ్డకు చెందిన లీలాకృష్ణతో వివాహమైంది. పెళ్లి సమయంలో లీలాకృష్ణకు అత్తింటివారు కట్న కానుకలు ఇచ్చారు. లావణ్య, లీలాకృష్ణకు సంతానం కలగలేదు. భర్త అదనపు కట్నం కోసం వేధిస్తుండటంతో లావణ్య కానూరులోని పుట్టింటికి వచ్చి ఉంటోంది. లీలాకృష్ణ ఇటీవల కానూరు వచ్చి భార్య, మామ ఎం.విశ్వనాథంతో తగాదాపడి దాడి చేశాడు. ఈ ఘటనపై లావణ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘనంగా మహిళా దినోత్సవం



ఉయ్యూరు మునిసిపాలిటీలో ప్రజాప్రతినిధులను సత్కరించిన మునిసిపల్ చైర్మన్ వల్లభనేని నాని, కమిషనర్ వెంకటేశ్వరరావు

ఉయ్యూరు: జగనన్నతోనే మహిళా సాధికారత సాధ్యమైందని ఉయ్యూరు మునిసిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అన్నారు. మునిసిపాలిటీలో బుధవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళా కౌన్సిలర్లు, ఉద్యోగులు, వివిధ విభాగాలకు చెందిన మహిళలను చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. చైర్మన్ వల్లభనేని నాని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అన్ని రంగాల్లోనూ సమాన అవకాశాలు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. వైస్ చైర్మన్ సోలే సురేష్ బాబు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. ఐద్వా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఉయ్యూరు ఆర్ఎంపీడబ్ల్యూఏ, రోటరీక్లబ్, లయన్స్ క్లబ్, వాకర్స్ క్లబ్, ఇన్నర్‌వీల్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో వేరువేరుగా మహిళా దినోత్సవం నిర్వహించి వివిధ రంగాల మహిళలను సత్కరించారు.

అన్ని రంగాల్లోనూ మహిళల ముందంజ : ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి

కంకిపాడు: అవకాశాలను అందిపుచ్చుకుంటూ మహిళలు అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉంటున్నారని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కంకిపాడు కేడీసీసీ బ్రాంచి కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. బ్రాంచ్ మేనేజరు మునునూరు సౌమ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను ఘనంగా సత్కరించారు. ఎంపీపీ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ మహిళల ఉన్నతికి ప్రభుత్వం, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కంకిపాడు సర్పంచ్ బాకీ రమణ, బ్రాంచి సూపర్‌వైజర్ వికెడి భవాని, కోలవెన్ను పీఏసీఎస్ అధ్యక్షురాలు అడుసుమిల్లి పూర్ణిమ, కంకిపాడు సొసైటీ అధ్యక్షురాలు జంపాన వెంకట పద్మావతి, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు. ఈడుపుగల్లు గాంధీనగర్ ఎంపీపీ పాఠశాలలో వంట ఏజెన్సీ కార్మికులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. ఎంఈఓ కనకమహాలక్ష్మి, జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం పద్మాబాయి తదితరులు పాల్గొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐకేపీ ఆధ్వర్యంలో వెలుగు సిబ్బందిని సన్మానించారు.

గన్నవరం ఎమ్మెల్యే కార్యాలయంలో..

గన్నవరం: స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణిని పలువురు మహిళా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సత్కరించారు. అనంతరం మహిళా ప్రజాప్రతినిధులందరూ కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు మాట్లాడుతూ.. మహిళల అభ్యున్నతికి, సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని రకాలుగా తోడ్పాటు అందిస్తోందన్నారు. ప్రజాప్రతినిధులుగా, నామినేటెడ్ పోస్టుల్లో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. వైస్ ఎంపీపీ కాలగడ్డ శివనాగరాజకుమారి, సర్పంచ్‌లు చేబ్రోలు లక్ష్మీమౌనిక, కొలుసు శిరీష, పలువురు ఎంపీటీసీ సభ్యులు, పార్టీ మహిళా నేతలు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ఉన్నతంగా ఎదగాలి

గన్నవరం రూరల్: మహిళలు సవాళ్లను ధైర్యంగా అధిగమించి ఉన్నతంగా ఎదగాలని గన్నవరం చీఫ్ అడిషనల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కె.జయలక్ష్మి సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన అవుటపల్లి డాక్టర్ సి.శోభనాద్రి సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ సంయుక్తంగా బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఎంచుకున్న లక్ష్యాలను సాధించేందుకు యువత, మహిళలు భయాలను దూరం పెట్టాలని పేర్కొన్నారు. కన్వీనర్ వి.శశికళ, ప్రిన్సి పాల్ జె.వందన, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ముస్తాబాద నవభారత్ హైస్కూల్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్ అండ్ టుటోరియల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్త్రీ మూర్తులు త్యాగాలను కొనియాడారు. పలువురికి సన్మానం చేశారు. కరస్పాండెంట్ షేక్ ఇమాం, ప్రిన్సిపాల్ షేక్ జాకీరా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో..



ఉంగుటూరు: మహిళలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే అన్ని రంగాల్లో రాణించగలుగుతారని పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాల డాక్టర్ జాస్మిన్ సుల్తానా సూచించారు. తేలప్రోలు ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో విమన్ ఎంపవర్‌మెంట్ అండ్ గ్రీవెన్స్ సెల్ ఆధ్వర్యంలో బుధవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విమన్ సెల్ కన్వీనర్ డాక్టర్ ఆర్.భార్గవి, ప్రిన్సిపాల్ ప్రసాద్, డైరెక్టర్ రాజశేఖర్, శ్రీహరిబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో

గన్నవరం: స్థానిక మండల పరిషత్ ఆవరణలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో బుధవారం అంతర్జాతీయ మహిళల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణిని ఏపీఓ మాధవి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు దేవరపల్లి సుశీల తదితరులు సత్కరించి జ్ఞాపిక అందజేశారు. క్రాంతి పథం సిబ్బంది, మండల సమాఖ్య కార్యవర్గం పాల్గొన్నాయి. డ్వాక్రా గ్రూపుల ఆడిట్ బృందం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్‌చేశారు. ఆడిట్ అధికారులు కామేశ్వరి, ఝాన్సీ, పలు సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



కంకిపాడు కేడీసీసీ బ్రాంచి కార్యాలయంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మిని సత్కరిస్తున్న బ్యాంక్ అధికారులు



గన్నవరం ఎమ్మెల్యే కార్యాలయంలో కేక్ కట్‌చేస్తున్న మహిళా ప్రజాప్రతినిధులు



వేడుకలను ప్రారంభించిన చీఫ్ అడిషనల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ జయలక్ష్మి

జగనన్న పాలనలోనే మహిళా సాధికారత

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలోనే మహిళా సాధికారత సాధ్యమైందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. తాడిగడపలో బుధవారం మహిళా దినోత్సవం సందర్భంగా ఆయన పలువురు మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ.. మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించడానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్నారు. డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు సున్నా వడ్డీతో పాటు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. మహిళల భద్రతకు దిశ చట్టం అమలు చేస్తున్నామని వివరించారు. రాష్ట్ర బీసీ సంఘ అధ్యక్షురాలు వేముల బేబిరాణి, జిల్లా అధ్యక్షురాలు వి.విమల దేవి, మునిసిపాలిటీ మహిళా అధ్యక్షురాలు పి.నాగలక్ష్మి, ముచ్చు దుర్గాభవాని, వైఎస్సార్ సీపీ నేతలు మేడసాని చిట్టి, నర్రా చంటి, ముచ్చు నాగేంద్ర పాల్గొన్నారు. యనమలకుదురులో జరిగిన మహిళా దినోత్సవంలో బట్రాజు కార్పొరేషన్ చైర్ పర్సన్ కూరపాటి గీతాంజలిని సత్యసాయి ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. పెనమలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వై.దుర్గాభవానితో పాటు ఉపాధ్యాయినులను విద్యార్థులు, సహచర ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో సీఎస్‌సీ విభాగం ఆధ్వర్యంలో అదనపు డెప్యూటీ కమిషనర్ పి.వెంకటరత్నం, డాక్టర్ అట్లూరి పల్లవిని ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.వి.రత్నప్రసాద్, సీఎస్‌సీ హెడ్ రాజేశ్వరరావు, ప్రొఫెసర్ వాసవి పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మహిళా దినోత్సవం సందర్భంగా 200 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఐసీసీ చైర్‌పర్సన్ చాగర్లమూడి బేబీరాణి, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



తాడిగడపలో మహిళలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



బట్రాజు కార్పొరేషన్ చైర్‌పర్సన్ గీతాంజలిని సన్మానిస్తున్న మహిళలు

వైభవంగా అయ్యప్ప స్వామి జన్మదినోత్సవం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కోడూరుపాడులో అయ్యప్ప స్వామి జన్మదిన మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని కోదండ రామస్వామి దేవస్థానం ప్రాంగణంలో వైస్ ఎంపీపీ చందు రమాదేవి, శ్రీనివాసరావు దంపతుల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తుల అయ్యప్ప నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. గురుస్వామి తోట శివశంకరరావు నేతృత్వంలో శబరిమల అయ్యప్ప దేవస్థానంలో నిర్వహించే పద్ధతిలో విశేష పూజా కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి. వేద మంత్రోచ్చరణ మధ్య గణపతి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వామికి అష్ట ద్రవ్యాభిషేకం, అన్నాభిషేకం వైభవంగా జరిగాయి. అనంతరం రెండు వేల మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. మాజీ సర్పంచ్ గరికపాటి రామకృష్ణ పాల్గొన్నారు.



గణపతి హోమం నిర్వహిస్తున్న వైస్ ఎంపీపీ చందు రమాదేవి, శ్రీనివాసరావు దంపతులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెనమలూరు: మండలంలోని పోరంకి వద్ద విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ప్రైవేటు ఆస్పత్రిలో పని చేస్తున్న ఇద్దరు నర్సులు గాయపడ్డారు. ఈ ఘటనపై పెనమలూరు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పోరంకిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో కంకిపాడుకు చెందిన ఎం.దీపిక, దివ్య నర్సులుగా ఉద్యోగం చేస్తున్నారు. వారు మంగళవారం విధులు ముగించుకుని ఇంటికి బయలుదేరి ఆస్పత్రి ఎదుట రోడ్డు దాటుతుండగా విజయవాడ నుంచి కంకిపాడు వైపుకు వెళ్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో గాయపడిన వారిని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

సంక్షేమ పథకాలతో భరోసా

పెనమలూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతోనే తమ జీవితాలకు భరోసా కలిగిందని పేదలు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి బుధవారం తాడిగడప కార్మికనగర్–2లో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వం పేదలకు అందించిన సంక్షేమ పథకాల బ్రోచర్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక మహిళ పి.సావిత్రి మాట్లాడుతూ.. తనకు వివిధ పథకాల కింద రూ.6 లక్షల వరకు ఆర్థిక సాయం అందిందని తెపారు. తనకు వైఎస్సార్ సున్నా వడ్డీ, చేయూత, జగనన్న అమ్మ ఒడి, పింఛన్ కానుక తదితర పథకాల కింద రూ.6.35 లక్షల సాయం అందిందని మరో మహిళ పెదమూర్తి జ్యోతి తెలిపారు. సంక్షేమ పథకాలతో తమ కష్టాలు తీరుతున్నాయని, జగనన్న ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం, పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేయడం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే సాధ్యమని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. జగనన్న కాలనీల్లో స్థలాలు పొందిన లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. డ్రెయిన్ల నిర్మాణం, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మునిసిపల్ కమిషనర్ ఎన్.ప్రకాశరావు, నేతలు అన్నే చిట్టిబాబు, ముచ్చు నాగేంద్ర, వీరబాబు, నర్రాచంటి, పోలవరపు బాబి, క్రిస్టోఫర్, వెలిశిల ప్రసాద్, వరప్రసాద్, పి.సాంబయ్య, ఖాదర్‌బాషా, జిన్నా, లక్ష్మి, జాన్‌బాబు, ముజీబ్, సిద్దిఖ్, మాదురమేష్, బబ్లూ, ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.



తాడిగడప కార్మికనగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

రాజకీయ బఫూన్.. లోకేష్



దావులూరు టోల్‌గేట్ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



పాలకవర్గంతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

- ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి
- కొలువుదీరిన ఉయ్యూరు ఏఎంసీ పాలకవర్గం
- చైర్మన్‌గా వల్లభనేని బాధ్యతల స్వీకరణ

ఉయ్యూరు: రాజకీయ అజ్ఞానిగా, బఫూన్‌గా నారా లోకేష్ తీరు ఉందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఎద్దేవాచేశారు. ఉయ్యూరు ఏఎంసీ పాలకవర్గ ప్రమాణస్వీకారం బుధవారం స్థానిక మార్కెట్ యార్డు ప్రాంగణంలో జరిగింది. తొలుత దావులూరు టోల్ గేట్ నుంచి ఉయ్యూరు మార్కెట్‌యార్డు వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన ప్రమాణ స్వీకార సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పార్థసారథి మాట్లాడుతూ.. లోకేష్ పరిపక్వత లేని పిల్ల కూన అని, రాష్ట్రానికి ఏం చేస్తాడో చెప్పలేని అసమర్థుడని విమర్శించారు. చంద్రబాబు, పవన్ నీచ రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. రానున్న ఎన్నికల యుద్ధ రంగంలో ఎల్లో మీడియా, ప్రతిపక్షాల కుట్రలను జగనన్న సైన్యం పటాపంచలు చేయాలని కోరారు. పెనమలూరు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక రూ.1600 కోట్ల అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు అమలయ్యాయని, వీటిపై ప్రతిపక్షాలతో చర్చకు సిద్ధమేనని సవాల్ విసిరారు. రైతు సంక్షేమానికి నూతన పాలకవర్గం కృషి చేసి ప్రభుత్వ లక్ష్యాలను చేరువ చేయాలని సూచించారు. ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మెరుగుమాల కాళీ ప్రసంగించారు. మునిసిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జంపాన కొండలరావు, ఎంపీపీ చీలి కల్పన, నాయకులు రాజులపాటి రామచంద్రరావు, సోలే సురేష్‌బాబు, వెంట్రప్రగడ బాబ్జీ, ఈడే చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ బాధ్యతల స్వీకరణ

ఏఎంసీ చైర్మన్‌గా వల్లభనేని వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్‌గా దాసే రవికుమార్, డైరెక్టర్లుగా బిట్రా వెంకట కిరణ్మయి, మంచిగంటి భార్గవి, జంగా నాంచారమ్మ, కొక్కిలిగడ్డ మరియమ్మ, కొండపల్లి ఆదిలక్ష్మి, కూనపరెడ్డి అనూష, దారావత్తు బాబీ, పెనుమూడి వాణి, అబ్దుల్ సద్దాం, అమరపు సాంబశివరావు, గ్రంథి తిరుమల వెంకటేశ్వరరావు, ఆరేపల్లి నాగరాజు, ఊర నాగిన్, బొమ్ము లక్ష్మారెడ్డి, గెత్తం అనుపమ బాధ్యతలు స్వీకరించారు. ఎమ్మెల్యే పార్థసారథి నూతన పాలకవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు. ఏఎంసీ కార్యదర్శి వంశీకృష్ణ సంతకాలు సేకరించారు.

వైఎస్సార్ బీమా అందజేత

పెనమలూరు: మండలంలోని గంగూరు గ్రామంలో బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద తొలివిడత సాయంగా మట్టి ఖర్చులకు రూ.10 వేలు అందజేశారు. గ్రామానికి చెందిన వెలిశిల కిషోర్ ఇటీవల మరణించాడు. వైఎస్సార్ బీమా పథకం కింద మృతుడి భార్య వెలిశిల భానుకు వార్డు సభ్యుడు కొత్తూరి పిచ్చయ్య రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఈఓ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నివారణకు టీకా డ్రైవ్

పెనమలూరు: మండలంలోని కానూరులో ఉన్న అమెరికన్ అంకాలజీ ఇనిస్టిట్యూట్‌లో మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు క్యాన్సర్ నివారణకు ప్రత్యేకంగా టీకా డ్రైవ్ నిర్వహిస్తున్నామని డాక్టర్ అనీలా పాటిబండ్ల, మెడికల్ డైరెక్టర్ రాజేష్ కోటా తెలిపారు. కానూరులో వారు బుధవారం విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. మహిళలు ఎక్కువగా రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బారిన పడుతున్నారని పేర్కొన్నారు. హెచ్‌పీవీ వైరస్ కారణంగా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వస్తుందని తెలిపారు. ముందస్తుగా దీనిని నివారించటానికి హెచ్‌పీవీ టీకా వేయించుకోవాలని సూచించారు. ఈ టీకాతో తొమ్మిది రకాల హెచ్‌పీవీ సంబంధిత వ్యాధులు రాకుండా నివారించవచ్చని వివరించారు.

ముస్తాబాద నుంచి పశ్చాత్తాప పాదయాత్ర



గన్నవరం రూరల్: పాపులను రక్షించేందుకు ప్రభువైన ఏసు క్రీస్తు శిలువపై ప్రాణం అర్పించారని ముస్తాబాద ఆర్సీఎం విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ ఎం.ఆంతోని బాల జోసఫ్ పేర్కొన్నారు. ముస్తాబాద నుంచి గుణదల మరియమాత పుణ్యక్షేత్రం వరకూ విశ్వాసులు, భక్తులతో కలసి బుధవారం పశ్చాత్తాప పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జెరూసలేంలో శిలువను మోస్తూ కల్వరి కొండ మీదకు వెళ్లి ప్రభువు ప్రాణం అర్పించిన ఆ విషయాలను దీక్షాపరులు, భక్తులు తెలుసుకుని వాటిని మనసులో పదిల పరుచుకుని విశ్వాసంతో బలపడాలని సూచించారు. క్రీస్తు మార్గంలో అందరూ నడవాలన్నారు. క్రైస్తవ గీతాలు పాడుకుంటూ సంఘ పెద్దలు, మరియదళం, యూత్ యాత్రలో కొనసాగారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



హనుమాన్‌జంక్షన్ రూరల్: మహిళలు ఉద్యోగ, స్వయం ఉపాధి కల్పన రంగాల్లో రాణించి ఆర్థిక స్వావలంబన సాధించాలని బాపులపాడు జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, సర్పంచ్ సరిపల్లి కమలాభాయి సూచించారు. స్థానిక మహాత్మాగాంధీ నగర్‌లో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. గంగాభవాని, సరిపల్లి కమలాభాయిని డ్వాక్రా మహిళలు ఘనంగా సత్కరించారు. అనంతరం జెడ్పీటీసీ సభ్యురాలు గంగాభవాని మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. సర్పంచ్ సరిపల్లి కమలాభాయి మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న వేధింపులు, లైంగిక దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన దిశ యాప్‌ను వినియోగించాలని సూచించారు. ఏపీఎం ఎస్.భూపతిరావు, సీసీలు కమల కుమారి, విమల కుమారి, మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు, డ్వాక్రా లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు. స్థానిక ఏలూరురోడ్డులోని గణపతి కాంప్లెక్స్‌లో 38 సంవత్సరాలు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న మండలపు సులోచనను మానవత సభ్యులు ఘనంగా సత్కరించారు. మానవత జిల్లా అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు, హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు చక్కా సుబ్బారావు, బెజవాడ శ్రీరామ్మూర్తి, సీనియర్ సభ్యులు డాక్టర్ నిడమర్తి లలితా కామేశ్వరి, గంటా సత్యనారాయణ పాల్గొన్నారు.